# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 273

బుధవారం | 08 మే 2024 | పేజీలు : 08 | వెల రూ. 5




## నా యువ మిత్రుడిని కలిశా..

### ట్విటర్‌లో మోడీ ట్వీట్

లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం నగరానికి విచ్చేసిన ప్రధాని నరేంద్ర మోడీ ఓ చిన్నారితో సరదాగా గడిపారు. బీజేపీ ఓరుగల్లు జనసభకు కాన్వాయ్ లో వెళ్తున్న ఆయన లక్ష్మీపురం గ్రామం వద్ద ఓ చిన్నపిల్లాడిని ఎత్తుకుని తన కారులో ఆడించారు. దీంతో అక్కడివారు ప్రధాని ఔదార్యాన్ని ప్రత్యక్షంగా వీక్షించి సంబురపడ్డారు. ఆ ఫొటోను ప్రధాని తన ట్విటర్ లో పోస్ట్ చేశారు. దానికి 'నా యువ మిత్రుడిని కలిశా' అంటూ క్యాప్షన్ ఇచ్చారు.

– వరంగల్ వాయిస్, వరంగల్

# బీజేపీ గెలుపు.. ఖాయమైంది





వివరాలు 2లో..


- మూడు విడతల్లో కమలందే పైచేయి
- వికసిత్ భారత్ మా లక్ష్యం
- దేశం తప్పుడు వ్యక్తుల చేతుల్లోకి వెళితే ప్రమాదం
- బీజేపీకి అండగా నిలుస్తున్న ఓరుగల్లు ప్రజలు
- 40 ఏళ్ల క్రితమే హనుమకొండలో కాషాయం జెండా ఎగిరింది

దేశ వ్యాప్తంగా మొదటి మూడు విడతల్లో జరిగిన ఎన్నికల్లోనే భారతీయ జనతా పార్టీ విజయం ఖరారైందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. నాలుగో విడతలో కాంగ్రెస్ గెలిచే సీట్లను చూడాలంటే భూతద్దం సరిపోదని.. మైక్రోస్కోప్ కావాల్సిందేనంటూ ఎద్దేవా చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని లక్ష్మీపురంలో నిర్వహించిన బీజేపీ ఓరుగల్లు జనసభకు ప్రధాని మోడీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నా తెలంగాణ కుటుంబ సభ్యులకు నమస్కారం అంటూ తెలుగులో తన ప్రసంగాన్ని ప్రారంభించారు. భద్రకాళి అమ్మవారి పాదాలకు, రామప్ప మందిరానికి నమస్కారం చేశారు. కాకతీయులు ఏలిన పవిత్ర నేల ఓరుగల్లు అంటూ కీర్తించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ తోడుదొంగలని, అవి నాణేనికి బొమ్మాబొరుసులాంటివని ఆరోపించారు. తెలంగాణ నుంచి ఢిల్లీ వరకు దేశవ్యాప్తంగా ఆర్ఆర్ ట్యాక్సుపైనే చర్చ జరుగుతోందని దుయ్యబట్టారు. ప్రతి ఎన్నికలో ఓరుగల్లు ప్రజలు బీజేపీకి అండగా నిలుస్తున్నారని కొనియాడారు. 40 ఏళ్ల క్రితమే హనుమకొండలో కాషాయం జెండా ఎగిరిందని మోడీ గుర్తు చేశారు. వికసిత్ భారత్ లక్ష్యంగా కృషి చేస్తున్న బీజేపీ అండగా నిలువాలన్నారు. వరంగల్‌లో అరూరి రమేష్, మహబూబాబాద్‌లో సీతారాం నాయక్‌కు ఓటు వేస్తే వికసిత తెలంగాణకు మీరు ఓటు వేసినట్టేనన్నారు. - వరంగల్ వాయిస్, వరంగల్

# మురిసిన ఓరుగల్లు


8 లో..




- మూడోసారి ప్రచారంలో పాల్గొన్న సీఎం
- వర్షంలోనూ కార్నర్ మీటింగ్‌కు హాజరైన రేవంత్ రెడ్డి
- ఈదురుగాలులను లెక్క చేయని జనం

## రాష్ట్రంలో కాంగ్రెస్ జెండా ఎగిరింది

ఇప్పుడు ఢిల్లీలో ఎగరాలి

ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య




8లో..




## ద్రోహులను ఓడించాలి

ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి

# బీజేపీ గెలుపు.. ఖాయమైంది









**మూడు విడతల్లో కమలందే పైచేయి**

**వికసిత్ భారత్ మా లక్ష్యం**

**దేశం తప్పుడు వ్యక్తుల చేతుల్లోకి వెళితే ప్రమాదం**

**బీజేపీకి అండగా నిలుస్తున్న ఓరుగల్లు ప్రజలు**

**40 ఏళ్ల క్రితమే హనుమకొండలో కాషాయం జెండా ఎగిరింది**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** కాంగ్రెస్ నేతలు రిజర్వేషన్లపై కుట్రలు చేస్తున్నారని ప్రధాని నరేంద్ర మోడీ హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో కోత పెట్టి ముస్లింలకు ఇవ్వాలని చూస్తోందని ఆరోపించారు. ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇలాంటి రిజర్వేషన్లు ఎలా సాధ్యమని ప్రశ్నించారు. మతపరమైన రిజర్వేషన్లను బీజేపీ వ్యతిరేకిస్తుంటే అది గిట్టని కాంగ్రెస్ అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ తీరుతో ఓబీసీలకు కూడా నష్టం జరుగుతుందన్నారు. మాదిగలకు రిజర్వేషన్లు ఇవ్వడానికి కాంగ్రెస్ అడ్డుపడుతోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ విజయం వైపు దూసుకెళ్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఎన్డీఏ కూటమికే ప్రజలు పట్టం కట్టబోతున్నారన్నారు. దేశం తప్పుడు వ్యక్తుల చేతుల్లోకి వెళితే ప్రమాదమని హెచ్చరించారు. కాకతీయ సామ్రాజ్య ప్రతీక వరంగల్ అంటూ కితాబిచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నుంచి ఈ నగరాన్ని కాపాడాలన్నారు. వరంగల్ గడ్డపై బీజేపీ జెండా ఎగరబోతోందన్నారు. వేదికపైనుంచే వరంగల్ లోక్ సభ అభ్యర్థి అరూరి రమేష్, మహబూబాబాద్ అభ్యర్థి సీతారాం నాయక్ ను మోడీ ప్రజలకు పరిచయం చేశారు. వీరిద్దరినీ గెలిపించి లోక్ సభకు పంపించాలని కోరారు.

## 40ఏళ్ల క్రితమే..

నా దృష్టిలో వరంగల్ చాలా ముఖ్యమైనది...40 ఏళ్లక్రితమే హనుమకొండలో బీజేపీ జెండా ఎగిరిందని మోడీ గుర్తు చేశారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా వరంగల్ ప్రజలు ప్రతిసారీ బీజేపీకి అండగా ఉన్నారంటూ కితాబిచ్చారు. కాంగ్రెస్ ఎంతటి అబద్దాలకోరో వరంగల్ ప్రజలకు తెలుసు. ఆగస్టు 15న రైతుబంధు అంటూ కొత్తగా ప్రచారం చేస్తున్నారు. వేములవాడ రాజన్న మీద ఒట్టు వేస్తూ సనాతన ధర్మంపై దాడి చేస్తున్నారు అంటూ మండిపడ్డారు. ఇలాంటి ఒట్లు వేసేవారిని నమ్మొద్దన్నారు. లోక్ సభ ఎన్నికలు ముగియగానే రైతుబందుపై కాంగ్రెస్ పార్టీ చేతులెత్తేస్తుందని మోడీ జోస్యం చెప్పారు. ఇప్పటికే మహిళలకు ప్రతి నెల రూ.2500 ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు. రాష్ట్రంలో కరెంట్ కోతలు మొదలయ్యాయని దుయ్యబట్టారు. కాంగ్రెస్ వచ్చాక రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందన్నారు.

## కాంగ్రెస్, బీఆర్ఎస్ తోడుదొంగలు..

కాంగ్రెస్, బీఆర్ఎస్ తోడుదొంగలని, నాణేనికి అవి బొమ్మాబొరుసులాంటివని, అవి అవినీతి పార్టీలని మోడీ దుయ్యబట్టారు. తెలంగాణ ప్రజల స్వప్నాన్ని కాలరాశాయన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే ప్రజల కలలు సాకారమవుతాయని అందరూ భావించారని గుర్తు చేశారు. కానీ రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను తాకట్టుపెట్టి కుటుంబ లబ్ధి కోసమే బీఆర్ ఎస్ పనిచేసిందని ఆరోపించారు. మొదటినుంచి కాంగ్రెస్ కూడా కుటుంబ ప్రయోజనాల కోసమే పనిచేసిందన్నారు. వంశపారంపర్య రాజకీయాలతో దోపిడీ చేసిందని మండి పడ్డారు. మాజీ ప్రధాని పీవీని కూడా ఆ పార్టీ అవమానించిందన్నారు. ఆయన పార్థివ దేహాన్ని కాంగ్రెస్ కార్యాలయంలోకి అనుమతించని నీచ సంస్కృతి వారిదన్నారు. పీవీకి భారతరత్న ప్రకటించి బీజేపీ గౌరవించిందన్నారు. దేశానికి ఆయన చేసిన సేవ ఎంతో ఉన్నతమైందన్నారు. పీవీ కుటుంబంలోని మూడు తరాల సభ్యులను కలిశానని, వారి నుంచి ఎన్నో విషయాలు తెలుసుకున్నానన్నారు.

## వారిది ఫెవికాల్ బంధం..

అవినీతిలో కాంగ్రెస్, బీఆర్ ఎస్ లది ఫెవికాల్ బంధంఅని ప్రధాని మోడీ ఆరోపించారు. ప్రజల ముందు ఒకరిపై ఒకరు అవినీతి ఆరోపణలు చేసుకుంటారు. అవినీతి సిండికేట్‌లో బీఆర్ఎస్, కాంగ్రెస్ భాగస్వాములంటూ ప్రధాని మోదీ విమర్శలు గుప్పించారు. ఇందుకు రెండు ఉదాహరణలు చెప్పారు. కాంగ్రెస్‌పై ఓటుకు నోటు ఆరోపణలు చేసిన బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఏం చేయలేక పోయిందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టులో కుంభకోణం జరిగిందని కాంగ్రెస్ ఆరోపించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాళేశ్వరం స్కామ్‌పై చర్యలు తీసుకోవట్లేదని ప్రధాని మోదీ ఆరోపించారు. కాంగ్రెస్ ఎక్కడ ఉంటే అక్కడ సమస్యలుంటాయన్నారు. కుంభకోణాలు, అవినీతికి కేరాఫ్ కాంగ్రెస్ అని విమర్శించారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే దేశం ఆగం అవుతుందన్నారు.

## ఆర్ఆర్ ట్యాక్స్..

తెలంగాణ నుంచి ఢిల్లీ వరకు దేశవ్యాప్తంగా ఆర్ఆర్ ట్యాక్సుపైనే చర్చ జరుగుతోందని మోదీ అన్నారు. రాష్ట్రంలో డబుల్ ఆర్ ట్యాక్స్ పేరుతో ప్రజలను దోచుకుంటున్నారని మండిపడ్డారు. ఇక్కడున్న ఒక ఆర్.. ట్యాక్స్ వసూలు చేసి, ఢిల్లీలో ఉన్న మరో ఆర్ కు కప్పం కడుతోందని ప్రధాని మోదీ విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రాష్ట్రాలు వాళ్లకు ఏటీఎం లాగా మారాయన్నారు. కలెక్షన్లలో ట్రిపుల్ ఆర్ సినిమాని డబుల్ ఆర్ ట్యాక్స్ మించి పోయిందని ప్రధాని మోదీ నిప్పులు చెరిగారు. ట్రిపుల్ ఆర్ సినిమా వెయ్యి కోట్లు సాధిస్తే.. డబుల్ ఆర్ మాత్రం కొన్ని రోజుల్లోనే ఆ విలువను దాటేసిందన్నారు. డబుల్ ఆర్ టాక్స్ నుంచి తెలంగాణను విముక్తి చేయాలని కోరారు.



## ప్రధాని సభకు తరలిన నేతలు..

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పార్లమెంట్ పరిధిలో లక్ష్మీపురంలో బుధవారం జరిగిన ఓరుగల్లు జనసభకు 60వ డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ దాస్యం అభినవ్ భాస్కర్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో తరలివెళ్లారు. బీజేపీ నాయకులు, అనుబంధ కమిటీ సభ్యులు, బూత్ కమిటీ సభ్యులు ప్రయాణిస్తున్న బస్సులకు అభినవ్ భాస్కర్ జెండా ఊపి ప్రారంభించారు. వారితో కలిసే ప్రధాని సభా ప్రాంగణానికి చేరుకున్నారు. అదే విధంగా 8వ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ బైరి లక్ష్మి కుమారి ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున ప్రధాని సభకు తరలివెళ్లారు.





## పట్టుదల, సాధనతో క్రీడల్లో రాణించాలి

### జిల్లా క్రికెటర్ అసోసియేషన్ సెక్రటరీ బాదం ప్రవీణ్



**వరంగల్ వాయిస్, ములుగు :** పట్టుదలతో సాధన చేసి క్రీడాకారులు క్రీడల్లో రాణించాలని ములుగు జిల్లా క్రికెటర్ అసోసియేషన్ సెక్రటరీ బాదం ప్రవీణ్ సూచించారు. హైదరాబాద్ క్రికెటర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత కొన్ని రోజులుగా ములుగు జిల్లా కేంద్రంలో క్రీడాకారులకు ఉచితంగా క్రికెట్ కోచింగ్ ఇస్తున్నారు. కాగా, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో బుధవారం క్రికెట్ క్రీడాకారులకు నెట్ ప్రాక్టీస్ ఏర్పాటు చేయగా బాదం ప్రవీణ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడాకారులతో కలిసి కాసేపు క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా బాదం ప్రవీణ్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని అన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని, పట్టుదలతో ప్రయత్నం చేస్తే సాధించలేనిది ఏమీ ఉండదన్నారు. హైదరాబాద్ క్రికెటర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ కోచింగ్‌ను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## బీభత్సవం సృష్టించిన ఈదురు గాలులు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి రహదారిపై వెళుతున్న కారుపై తాటిచెట్టు విరిగి పడడంతో ఐదుగురికి గాయాలైన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాళ్లపూసపల్లిలో చోటుచేసుకుంది. వెళుతున్న కారుపై వర్షానికి చెట్టు విరిగి పడడంతో కారు రహదారి పై నుంచి పంటపొలాల్లో దూసుకుపోయి కారులో ఉన్న ఐదుగురికి గాయాలయ్యాయి. గాయాలైన వారిని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. పలు గ్రామాల్లో రహదారిపై చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడి రాకపోకలు స్తంభించాయి. గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి అంధకారమయ్యాయి.

## నీటి గుంతను పూడ్చండి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పట్టణ కేంద్రంలోని స్థానిక అన్నారం చౌరస్తాలో తొర్రూరు నుంచి నర్సంపేటకు వెళ్లే మార్గంలో రోడ్డు పూర్తిగా గుంతగా మారి అందులో మురికి నీరు, రోడ్డు పక్కన ఉన్న ఇతర షాపుల నుంచి వచ్చే నీరు ఆ రోడ్డు గుంతలో నీరు నిల్వ ఉండటంతో అటుగా వెళ్లే ద్విచక్ర వాహనదారులకు, ఇతర వాహనదారులకు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతోంది. కొన్ని సందర్భాలలో వాహనదారులు తమ కుటుంబాలతో వాహనంపై ఆమార్గం గుండా వెళ్లేటప్పుడు జారి ఆ నీటి గుంతలో పడి ప్రమాదాలకు గురవుతున్నామని పలువురు వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఆ నీటి గుంత నుంచి వాహనదారులకు ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ ఆర్ అండ్ బీ, మున్సిపల్ శాఖకు సంబంధించిన అధికారులు నీటి గుంతను పూడ్చడంలో నిమ్మకు నీరేత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానిక ప్రజలు ఆవేదనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బీ, మున్సిపల్ శాఖ అధికారులు వెంటనే స్పందించి అన్నారం చౌరస్తాలో ఏర్పడిన నీటి గుంతను త్వరగా పూడ్చి ద్విచక్ర వాహదారులను, ఇతర వాహనదారులను ప్రమాదాల నుంచి కాపాడాలని కోరుతున్నారు.

# విభజన హామీలపై నోరువిప్పని మోడీ

### వరంగల్‌కు ఏం ఒరగబెట్టారని బీజేపీకి ఓటెయ్యాలి

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ లో జరిగిన బీజేపీ ఎన్నికల సభలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విభజన హామీల అమలుపై నోరు విప్పకుండా మరోసారి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన జిల్లా ముఖ్య కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తక్కళ్లపల్లి శ్రీనివాస రావు మాట్లాడుతూ గడిచిన పదేళ్ల పాటు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తెలంగాణ విభజన సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. నేడు లోక్ సభ ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ, తెలంగాణలో వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ గురించి మోడీ నోరు విప్పలేదని అన్నారు. మోడీ ప్రభుత్వ హయాంలోనే నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు ఆకాశాన్ని అంటి సామాన్యులు బతుకలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. విదేశాల్లోని నల్లధనం తెచ్చి ప్రజలకు పంచుతామని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించి వారి ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని చెప్పిన హామీలను తుంగలో తొక్కి నేడు మతం, కులాల పేరుతో ఓట్లు దండుకుని మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. లోక్ సభ ఎన్నికలలో బీజేపీ, బీఆర్ఎస్ లను ఓడించి ఇండియా కూటమి అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కర్ణాకర్, నాయకులు ఆదరి శ్రీనివాస్, మద్దెల ఎల్లేష్, కర్రె లక్ష్మణ్, మునిగాల భిక్షపతి, వేల్పుల సారంగపాణి, ఏశబోయిన శ్రీనివాస్, బాషబోయిన సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటు వేయకుంటే జనాభాలో లేనట్టే




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఓటు వేయకపోతే జనాభాలో లేనట్టేనని వరంగల్ సీనియర్ సిటిజన్స్ ప్రతినిధులు అన్నారు. వరంగల్ కొత్తవాడలోని గోపాల స్వామి గుడి ఆవరణలో ఉదయం 6.00 గంటలకు వాకర్ అసోసియేషన్ సభ్యులను, మహిళలను, యువకులను సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ వరంగల్ ప్రతినిధులు కలిసి ఓటు హక్కు వినియోగం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హాజరైన సభ్యులతో అసోసియేషన్ ప్రతినిధులు లోక్ సభ ఎలక్షన్ 2024 పురస్కరించుకొని వరంగల్ నగరంలోని అందరం బాధ్యతతో ఓటు వేద్దామని కోరారు. గ్రామాలలో 90 శాతం పైగా ఓటు వేస్తున్నారని, మన వరంగల్ నగరంలో 60 శాతం లోపలనే ఓటింగ్ శాతం పడుతోంది. వరంగల్ వాసులం కూడా 90 శాతం ఓటు వేద్దామని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ మే 13న సామాజిక బాధ్యతగా ఓటు వేద్దామన్నారు. ఓటు వేయకపోతే దేశ జనాభాలో లేనట్టేనని భావించాలన్నారు.అందరం కలిసి తప్పనిసరిగా ఓటుహక్కు వినియోగించుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు కోన్‌రెడ్డి మల్లారెడ్డి, నిమ్మకాయల సదానందం, ప్రధాన కార్యదర్శి, కందుల గోవర్ధన్ ఉపాధ్యక్షుడు, వి.వెంకట మల్లు ట్రెజరరీ, కార్యవర్గ సభ్యులు జి.నరసింహా రాములు, డి.రాజమౌళి, ఎ.రాజేంద్రప్రసాద్, మోహన్, వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడు జయప్రకాష్, కార్యవర్గసభ్యులు సత్యనారాయణ, రాజు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు బుద్ధి చెప్పాలి

### మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, దామెర :** అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మరిచిన కాంగ్రెస్ పార్టీకి లోక్ సభ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, వరంగల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి డా.మారేపల్లి సుధీర్ కుమార్ అన్నారు. కొద్దిరోజుల క్రితం కాంగ్రెస్ పార్టీలో చేరిన దామెర మండల దుర్గంపేట గ్రామానికి చెందిన చెల్పూరి చంద్రయ్య, మోతె శ్రీనివాస్, ముదురుకోళ్ల రాజశేఖర్ తిరిగి బీఆర్ఎస్ లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి మాజీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి ఇద్దరూ సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల మోసాన్ని కూడా గుర్తు చేయాలని తెలిపారు. ఇందుకోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. తొందరపడి బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ లో చేరిన వారు తలలు పట్టుకొని బాధపడుతున్నారని అన్నారు. త్వరలోనే బీఆర్ఎస్ కు పూర్వ వైభవం వస్తుందని, కాంగ్రెస్ పార్టీ నాయకుల బెదిరింపులకు భయపడి, మాయ మాటలకు మోసపోయి పార్టీని వీడొద్దని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ అభివృద్ధికి బీఆర్ఎస్‌ను గెలిపించాలి

### కార్పొరేటర్ బోగి సువర్ణ సురేష్



**వరంగల్ వాయిస్, ఖిల్లా వరంగల్ :** తెలంగాణ అభివృద్ధి కోసం పోరాటం చేసిన బీఆర్ఎస్ పార్టీని ప్రజలందరూ గెలిపించాలని 37వ డివిజన్ కార్పొరేటర్ బోగి సువర్ణ సురేష్ కోరారు. ఈ సందర్భంగా బుధవారం 37వ డివిజన్ లోని గిరిప్రసాద్ నగర్, పడమర కోట 4, 5 బ్లాక్స్, మైనారిటీ కాలనీ, తూర్పు కోట కొత్తగడ్డ, పెరుకవాడ, ముదిరాజ్ వాడ, యాదవ వాడ, వివిధ కాలనీలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సువర్ణ సురేష్ లు ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రజా సమస్యలను, ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందన్నారు. కేసీఆర్ రైతు బాట ద్వారా రైతులకు పంట నష్టం ఇవ్వాలని, నీటిని విడుదల చేయాలనీ, రైతు బంధు ఇవ్వాలని పోరాటం చేయడం వలన ప్రభుత్వం దిగివచ్చి అమలు చేసేందుకు ఒప్పుకుందన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ లోక్ సభ అభ్యర్థి డా.సుధీర్ కుమార్ ను గెలిపిస్తే కేసీఆర్ కు మరింత బలం ఇచ్చినట్లు ఉంటుందని అన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం నిరంతరం పరితపించే నాయకుడు కేసీఆర్ కాబట్టి, ప్రజలందరూ బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ఓడించి తెలంగాణ గళాన్ని పార్లమెంట్ లో వినిపించేందుకు బీఆర్ఎస్ ను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ ఇంచార్జులు బెల్లంకొండ సుధాకర్, మేకల ఎల్లయ్య, సతీష్, రబ్బానీ, నవీన్, శ్యామ్, బషీర్, నరేష్, యాదగిరి, రమణ, రాజు, యాదగిరి, నరేష్, అరుణ, సారంగం, నిర్మల, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేకి మోడీని గద్దె దించాలి

## కడియం కావ్యను గెలిపించాలి

### తాటిపాముల వెంకట్రాములు




**వరంగల్ వాయిస్, వరంగల్ :** కార్మిక వ్యతిరేక విధానాలతో దుష్పరిపాలన చేస్తున్న బీజేపీ మోడీ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు దేశవ్యాప్తంగా కార్మిక వర్గం సంసిద్ధమైందని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని కార్యాలయంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యకర్తల సమావేశానికి మునిగాల భిక్షపతి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకట్రాములు ప్రసంగిస్తూ ఉద్యమాల ద్వారా సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ కోట్లాది మంది కూలీల పొట్ట కొట్టిన దుర్మార్గ పాలకులకు బుద్ధి చెప్పే సమయం వచ్చిందన్నారు. గత పదేళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ బడుగు బలహీన వర్గాలకు, మైనార్టీలకు, మహిళలకు రక్షణ లేని పరిస్థితి ఏర్పడిందన్నారు. దేశ సంపదను దోచుకున్న కార్పొరేట్ల, పారిశ్రామికవేత్తల ఆస్తులు ఆకాశానికంటాయని శ్రమజీవుల బ్రతుకులు పాతాళానికి దిగజారాయన్నారు. సామాజిక న్యాయం కోసం, లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థ, రాజ్యాంగం, బడుగు బలహీన వర్గాల రిజర్వేషన్ల రక్షణ కోసం మోడీ పాలనకు చరమగీతం పాడి ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు దేశవ్యాప్తంగా బీకేఎంయూ కృషి చేస్తున్నదన్నారు. వరంగల్ లోక్ సభ స్థానానికి ఇండియా కూటమి పక్షాన పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థిని కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని వెంకట్రాములు పిలుపునిచ్చారు. జాతీయ సమితి సభ్యులు మోతె లింగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు మునిగాల భిక్షపతి, అయిలయ్య, బొట్టు భిక్షపతి, కందుల కవిత, వివిధ మండలాల నుంచి కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి

## కార్పొరేటర్ మరుపల్ల రవి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఈనెల 13న జరిగే వరంగల్ లోక్ సభ ఎన్నికల్లో నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మారేపల్లి సుధీర్ కుమార్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పూజారి విజయ్ ఆధ్వర్యంలో కార్పొరేటర్ మరుపల్ల రవి ప్రతి ఇంటింటికి తిరుగుతూ ప్రజలను కలుసుకొని గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ డివిజన్ లోని ఓటర్లందరూ మాయమాటలకు డబ్బులకు ప్రలోభ పడవద్దని ఓటర్లను కోరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మాయమాటలు చెప్పి అరచేతిలో వైకుంఠం చూపించిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలను ఎరవేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని పిలుపుపిచ్చారు. ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నిలబెట్టుకోలేదని, అందుకే కారు గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పూజారి విజయ్, కార్యదర్శి వనం కుమార్, నాయకులు కోరే కృష్ణ, అంకం దేవానంద్, పెర్ణ రవి, మరుపల్ల గౌతం, సాదుల రంజిత్, శెట్టి మోహన్, గజ్జి సాంబయ్య, పోలేపాక రాజన్ బాబు, కళ్యాణపు వెంకటేశ్వర్లు, కొలుపుల చంద్రకళ, ఎండీ వహీదా, ఆవునూరి సునీత, పోలపాక మల్లేశం, మంద నవీన్, చీర రమేష్, కుండే క్రాంతి, చింతపట్ల ప్రశాంత్, వేల్పుగొండ నర్సింగం, వేల్పుగొండ రంజిత్, క్యాతం రాజేందర్, సామల కోటి, మాటేటి సారయ్య, నరిగె సదానందం, ఆవునూరు చిన్న, సునీత, మున్నీ, నామాల చందర్ తదితరులు ఉన్నారు.

# సీఎం రేవంత్ ఫొటో బహూకరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నిన్న జరిగిన సీఎం రేవంత్ రెడ్డి రోడ్ షో ఎన్నికల ప్రచారంలో భాగంగా హనుమకొండ చౌరస్తాలోని ప్రచారంలో సీఎం పాల్గొన్న సందర్భంగా వారి వివాహ వార్షికోత్సవ పురస్కరించుకొని 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు వారికి ఫొటో ఆల్బమ్ బహుకరించి శుభాకాంక్షలు తెలిపారు.

# మానుకోటలో ఘనంగా రెడ్ క్రాస్ దినోత్సవం



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ప్రపంచవ్యాప్తంగా ఎక్కడైనా యుద్ధాలు, ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు తీవ్రంగా నష్టపోయిన వారిని ఆదుకొని, ఆసరా ఇచ్చి కాపాడే, ప్రపంచంలోనే అతిపెద్ద సేవా సైన్యం రెడ్ క్రాస్ అని రెడ్ క్రాస్ శాశ్వత సభ్యుడు జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. రెడ్ క్రాస్ ప్రదాత జాన్ హెన్రీ డ్యూనాంట్ పుట్టినరోజు సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని అడ్వకేట్స్ కాలనీలో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ అశోక్ మాట్లాడుతూ నోబెల్ శాంతి బహుమతి మొదలుపెట్టిన 1901 సంవత్సరంలోనే మొట్టమొదటి అవార్డు గ్రహీత రెడ్ క్రాస్ సంస్థ ప్రదాత జాన్ హెన్రీ డ్యూనాంట్ అని, అంతే కాకుండా 1917, 1944, 1963 సంవత్సరాలలో కూడా నోబెల్ శాంతి బహుమతి పొందిన గొప్ప మానవీయ సంస్థ రెడ్ క్రాస్ అని, యుద్ధంలో గాయపడిన సైనికులు వారు ఎక్కడి వారైనా, ఎక్కడ ఉన్నా కూడా ప్రథమ చికిత్స అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందనే డ్యూనాంట్ గొప్ప ఆలోచనతో పురుడు పోసుకున్నదే ఈ సంస్థ అని అన్నారు. ప్రపంచంలోనే అతి ఎక్కువ శాఖలుకలిగి, అత్యంత పెద్ద సేవా సంస్థ అయినటువంటి, ఎక్కువసార్లు నోబెల్ శాంతి బహుమతి స్వీకార సంస్థ గా రెడ్ క్రాస్ గొప్ప చరిత్ర కలదని కొనియాడారు. అనంతరం రెడ్ క్రాస్ ప్రదాత 196వ జయంతిని ఘనంగా జరిపి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బాంబే -భీమండి సీనియర్ జర్నలిస్ట్ సిరిమల్ల శ్రీనివాస్, కామటి సుధీర్, వెంకన్న, రమేష్, ప్రవీణ్ ,సరోజ, సహజ తదితరులు పాల్గొన్నారు .

# 10న గౌతమ్ జూనియర్ కళాశాల మెరిట్ స్కాలర్ షిప్ టెస్ట్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని భీమారం గౌతమ్ జూనియర్ కళాశాలలో ఈనెల 10న మెరిట్ స్కాలర్ షిప్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల యాజమాన్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ స్కాలర్ షిప్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన మొదటి 15మంది విద్యార్థులకు రూ.20 లక్షల మెరిట్ స్కాలర్ షిప్‌ను అందజేస్తున్నట్లు వారు తెలిపారు. మొదటి 5 ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఐఐటీ, నీట్ ప్రైమ్ బ్యాచ్‌లో, తర్వాత 5 ర్యాంకులు సాధించిన వారికి ఇంటర్, ఎప్సెట్ లియోబ్యాచ్, ఆ తర్వాత 5 ర్యాంకులు సాధించి వారికి ఇంటర్ జనరల్ బ్యాచ్‌లో ఉచిత వసతితో కూడిన విద్యను అందిస్తామని పేర్కొన్నారు. మార్చి-2024 టెన్త్ పాసైన విద్యార్థులు మాత్రమే అర్హులని తెలిపారు. ఈనెల 10న ఉదయం 9గంటల లోపు 10వ తరగతి హాల్ టికెట్‌తో పాటు ఆధార్ జిరాక్స్‌తో కళాశాల ఆఫీస్ లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలనికోరారు. 9393444808, 7995424666కు వాట్సాప్ చేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. భీమారంలోని ఎస్వీఎస్ ఇంజినీరింగ్ కళాశాల పక్కనున్న గౌతమ్ జూనియర్ కళాశాల, ఔటర్ రింగ్ రోడ్ దగ్గరగా ఉన్న పలివేల్పులలోని గౌతమ్ జూనియర్ కళాశాలల్లో పరీక్ష నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఆదేశాల మేరకు 5వ డివిజన్ అధ్యక్షుడు పున్నం చందర్ ఆధ్వర్యంలో బుధవారం బీఆర్ ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డా.మారేపల్లి సుధీర్ కుమార్ గెలుపే ధ్యేయంగా కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్తిస్తూ 5వ డివిజన్ లోని సెయింట్ జోసెఫ్ స్కూల్ పరిధిలోని ప్రచారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రాము, భార్గవ్, ప్రదీప్ రెడ్డి, శ్రీలత, రమ, రవళి, సుహాసిని, శ్రీలత, ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల మద్దతుతో బీఆర్ఎస్ విజయం ఖాయం



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** ఈనెల 13న జరిగే లోక్ సభ ఎన్నికల్లో వరంగల్ ఎంపీ అభ్యర్థి సుధీర్ కుమార్ విజయం ఖాయమని రఘునాథ్ పల్లి బీఆర్ఎస్ ఇంచార్జి గూడ కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం రఘునాథ్ పల్లి మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పట్ల విశ్వాసంతో ఉన్నారని, తమ ప్రచారానికి ప్రజలు ఘన స్వాగతం పలుకుతున్నారని తెలిపారు. ప్రజల స్పందన చూస్తుంటే కచ్చితంగా లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని తెలుస్తుందన్నారు. రేపు రఘునాథ్ పల్లి మండలంలో మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ రాజయ్య ప్రచారం ఉన్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు ఇమ్మడిశెట్టి రఘు, దేవర యాకయ్య, మల్కాపురం అన్వేష్ గౌడ్, కడారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# హమాలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండల కేంద్రంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలలో పనిచేస్తున్న హమాలీలకు నాగుర్ల యువసేన నాయకుడు, స్థానిక ఆర్ఎంపీ వైద్యుడు లోకటి నగేష్ ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున హమాలీలు ఎండ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మంచినీళ్లు ఎక్కువగా తాగడం, పనివేళల్లో మార్పు చేసుకోవడం వల్ల వడదెబ్బ నుంచి రక్షించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగుర్ల యువసేన నాయకులు, హమాలీలు పాల్గొన్నారు.

# కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** మండలంలోని అశ్వరావు పల్లి గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తూర్పు కొండ స్వామి ఇటీవల యాక్సిడెంట్ కావడంతో బుధవారం ఆయన కుటుంబ సభ్యులకు ఆయనకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నామాల బుచ్చయ్య గౌడ్ రూ. 5000 ఆర్థిక సాయం చేశారు. బైక్ యాక్సిడెంట్ లో తీవ్రంగా గాయపడ్డ స్వామికి వైద్యం ఖర్చుల కోసం ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వేణు నీలాగయ్య, కుర్ర పరుశురాములు, తోటకూరి రాజు, పొదల రవి, మేకపోతుల స్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## కరాటే కోచ్ మణికంఠకు అంతర్జాతీయ గుర్తింపు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రముఖ కరాటే కోచ్ మణికంఠకు అంతర్జాతీయ సంస్థ నుంచి అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ కోచ్ గా గుర్తింపు లభించింది. నగరంలోని కొత్తవాడ ప్రాంతానికి చెందిన ప్రముఖ తెలంగాణ కరాటే కోచ్ గడదాసు మణికంఠ గత కొన్ని సంవత్సరాల నుంచి మణి మార్షల్ ఆర్ట్స్ అండ్ ఫిట్ నెస్ అకాడమీ స్థాపించి






సుమారు 1300 మంది విద్యార్థులకు పైగా మార్షల్ ఆర్ట్స్ లో శిక్షణ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచ స్థాయి కరాటే పోటీలలో భారతదేశ తరఫున ప్రతిభ కనబరుస్తున్నందుకు గుర్తింపుగా గతంలో 2022లో మణికంఠ జాతీయస్థాయి అవార్డు అందుకున్నారు. ఈసారి 2024లో అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ కోచ్ గా గుర్తింపు పొందారని గ్లోబల్ వరల్డ్ రికార్డ్స్, వరల్డ్ స్పోర్ట్స్ సర్వీస్ సంస్థ తెలిపింది. మార్షల్ ఆర్ట్స్ లో అంతర్జాతీయ గుర్తింపు పొందినందుకు మణికంఠకు వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, నగరంలోని ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు మేలు

**వరంగల్ వాయిస్, మరిపెడ :** బడుగు, బలహీన వర్గాల కోసమే కాంగ్రెస్ పార్టీ పుట్టిందని, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతమే పేద ప్రజలకు అండగా ఉండటమని మరిపెడ కాంగ్రెస్ పార్టీ నాయకుడు విసారపు శ్రీపాల్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మరిపెడ మరిపెడ



మున్సిపాలిటీ 9వ వార్డులో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు రెండు ఒక్కటేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు మేలు జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని అమలవుతున్న ప్రజాపాలన చూసి ఓటు వేయాలని మహబూబాబాద్ కాంగ్రెస్ పార్టీ లోక్ సభ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో అలువాల ఉప్పలయ్య ప్రజా పతి, పాష, దుగుంట్ల వెంకన్న, యాకూబ్ పాషా ఉపేందర్, వెంకన్న, సోమన్న,రాజు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని నర్సక్కపల్లి గ్రామంలో ఎంపీటీసీ బుర్రదీప దేవేందర్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు, వరంగల్ లోక్ సభ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య గెలుపును కోరుతూ చేతి గుర్తుకు



ఓటెయ్యాలని ఇంటింటికీ తిరుగుతూ, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో లోని 5 గ్యారెంటీల కార్డును ఇవ్వడం జరిగింది. ఇంటింటికి తిరుగుతూ బొట్టు పెడుతూ ఈవీఎం నమూనా చూపిస్తూ రెండవ నెంబర్ పై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో 19, 20, 21, బూత్ ల మహిళలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## 19వ డివిజన్‌లో బీఆర్ఎస్ ప్రచారం

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ కాశిబుగ్గ 19వ డివిజన్ లో వరంగల్ తూర్పు మాజీ శాసనసభ్యుడు నన్నపునేని నరేందర్ ఆదేశాల మేరకు 19వ డివిజన్ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు చిలువేరు పవన్ ఆధ్వర్యంలో 75, 76, 77 బూత్ లలో వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి మారేపల్లి సుధీర్



కుమార్ కారు గుర్తుకు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్ మహాశయులను కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు క్యాతం రంజిత్, బానోతు కిరణ్ నాయక్, చెన్నూరి కిషోర్, కొక్కరకొండ చిరంజీవి, నాసం హరీష్, జేపీ పాపయ్య, రాజ్ కిరణ్, బాలు, వరుణ్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీకి ఎందుకు ఓటేయాలి

### టీపీ జాక్ నాయకుల 30 ప్రశ్నలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కేంద్రంలో గత పదేళ్లు మోడీ ప్రభుత్వం అధికారం వెలగబెట్టిందని అధికారంలో ఉండి ప్రజల ఏ మౌలిక సమస్యలు పరిష్కరించకుండా హిందూ, ముస్లిం ప్రజల మధ్య వైషమ్యాలు పెంచుతూ మూడోసారి తమకే అధికారం ఇవ్వాలని కోరుతోందని, ఈ ప్రభుత్వానికి మరోసారి ప్రజలు ఎందుకు ఓటు వేయాలని టీపీజాక్ నాయకులు ప్రశ్నించారు. ఖిలా వరంగల్ పడమరకోట చమన్ సెంటర్ తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద బుధవారం టీపీ జాక్ ప్రచురించిన మోడీ ప్రభుత్వానికి 30 ప్రశ్నలతో కూడిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా నాయకులు రాచర్ల బాలరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్ బి.రమాదేవి మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్ లో ముడి చమురు ధరలు తగ్గిన పెట్రోల్ డీజిల్ ధరలు ఎందుకు పెరిగాయని, నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకు పెరుగుతుంటే కేంద్రం ఎందుకు కట్టడం చేయలేక పోయిందని ఆమె ప్రశ్నించారు. జాతీయ, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంవత్సరానికి రూ.2 లక్షల 72 కోట్లు ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.73 కోట్లు 73 వేల కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించిందన్నారు. ప్రజలు కోరుకున్న విధంగా పట్టణ ఉపాధి హామీ చట్టం ఎందుకు చేయలేదన్నారు. 2021 సంవత్సరంలో చేపట్టాల్సిన జనాభా గణనతో పాటు కుల గణన చేపట్టి నిజమైన పేద ప్రజలకు అందించాల్సిన సంక్షేమ పథకాలు అందకుండా మోడీ ప్రభుత్వం అనుసరించిందని ఆమె దుయ్యబట్టారు. భారత రాజ్యాంగం ఇచ్చిన ప్రాథమిక హక్కులను మోడీ ప్రభుత్వం హరించి ప్రజాసంఘాల నాయకులపై ఉపా లాంటి అక్రమ కేసులు బనాయించిందని, వాటిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ హక్కుల విలువల రక్షణ కోసం మోడీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో టీపీ జాక్ నాయకులు కళకంపెల్లి ప్రవీణ్, గద్దల సంజీవ, ఇనుముల కృష్ణ, చంద్రమౌళి, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపల్లి సావిత్రిని గెలిపించాలి

### ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు గడ్డం నాగార్జున



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తున్న ప్రజల మధ్య ఉంటూ ప్రశ్నించే ప్రజాగొంతుక వరంగల్ లోక్ సభ బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) బలపరిచిన ఎంసీపీఐ(యూ) అభ్యర్థి కొత్తపల్లి సావిత్రి కంప్యూటర్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు గడ్డం నాగార్జున వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. హనుమకొండ అంబేద్కర్ సెంటర్ లో బుధవారం కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున మాట్లాడుతూ. మోడీ ప్రభుత్వం దేశంలో దేశ సంపదని ఉన్నత వర్గాలకు దోచి పెడుతూ, అంబానీ ఆదానీలకు ప్రభుత్వ రంగ సంస్థల్ని అమ్ముతున్నారని ఆయన దుయ్యబట్టారు. మతం, దేవుళ్ల పేరుతో విభజిస్తూ పరిపాలన కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. దుర్మార్గమైన మోడీ పాలనకు గోరి కట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, ప్రజలు మేలుకోకపోతే భారత రాజ్యాంగాన్ని మార్చి ఆ స్థానంలో మనువాదాన్ని తీసుకొచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రైతాంగం గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతుంటే నల్ల చట్టాలు తేవాలని చాలా ప్రయత్నాలు చేశాడని, దానికి వ్యతిరేకంగా వేలాదిమంది రైతులు దేశ నడిబొడ్డులో 13 నెలల పాటు సుదీర్ఘ పోరాటం చేసిన తర్వాత మోడీ దిగివచ్చి నల్ల చట్టాల్ని వెనక్కి తీసుకున్నాడని ఆయన గుర్తు చేశారు. నేడు ప్రజలు వాటిని అనుభవిస్తున్నారన్నారు. ప్రజల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తున్న కామ్రేడ్ కొత్తపల్లి సావిత్రిని రాజకీయాలకతీతంగా కంప్యూటర్ గుర్తుకు ఓట్లు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) హనుమకొండ జిల్లా కమిటీ సభ్యులు మొగిలి శ్రీనివాసరావు, పార్టీ సభ్యులు మాట్టేడ మొగిలి, శేఖర్, కుమార్, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అయోధ్య రామ మందిరం, శ్రీరాముడి పూజిత అక్షింతలను, మెజారిటీ ప్రజల మనోభావాలను కాలరాసే విధంగా మాట్లాడడం వ్యంగ్యంగా ఛలోక్తులు విసరడం హిందుత్వం పైన, హిందువుల పైన తూలనాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో మాట్లాడడాన్ని విశ్వహిందూ పరిషత్ , భజరంగ్ దళ్ తీవ్రంగా ఖండిస్తుందని భజరంగ్ దళ్ వరంగల్ మహానగర్ సంయోజక్ బండి రోహిత్ యాదవ్ అన్నారు. విశ్వహిందూ పరిషత్ భజరంగ్ దళ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్ర ముఖ్యమంత్రి తెలంగాణ ప్రభుత్వ దిష్టిబొమ్మను వరంగల్ మహానగరంలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో దహనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ వరంగల్ మహానగర కార్యదర్శి శ్రీరామ్ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికలు రాగానే మెజారిటీ ప్రజలైన హిందువుల మనోభావాలను అవమానపరిచే విధంగా కించపరిచే విధంగా ఒక వర్గం ఓట్ల కోసం శ్రీరాముడిని అయోధ్య పూజిత అక్షింతలను అవహేళన చేసే విధంగా మాట్లాడడం ముమ్మాటికీ హేయమైన చర్యగా విశ్వహిందూ పరిషత్ భావిస్తుంది. ముఖ్యమంత్రి, మంత్రివర్గం కాంగ్రెస్ నాయకులు భేషరతుగా హిందువులకు క్షమాపణ చెప్పాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి మంత్రి వర్గాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ మహానగర ఉపాధ్యక్షుడు వెలగందుల రాజు, భజరంగ్ దళ్ మహానగర సంయోజక బండి రోహిత్ యాదవ్, సాహ సంయోజక్ గంగారపు హరీష్, భజరంగ్ దళ్ సురక్ష ప్రముఖ కొల్లూరి ఆదిత్య సాయి, వరంగల్ మహానగర సహ కార్యదర్శి ఎడెల్లి సందీప్ రెడ్డి, పెండ్లి సునంద్, గూడూరు రాకేష్, సందీప్ తేజ, నంగునూరు నాగరాజు, తదితర విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బలరాం నాయక్ గెలుపునకు విస్తృత ప్రచారం



**వరంగల్ వాయిస్, మరిపెడ :** మహబూబాబాద్ లోక్ సభ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ బుధవారం మూలమర్రి తండా గ్రామ పంచాయతీ పరిధిలో మండల పార్టీ నాయకుడు భూక్య వెంకన్న, తేజావత్ నెహ్రూ నాయక్ ల ఆధ్వర్యంలో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన ఐదు గ్యారంటీలను వివరిస్తూ చేతి గుర్తుపై ఓటు వేసి బలరాం నాయక్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను మూడు నెలలలో నిలబెట్టుకోవడం జరిగిందని, అదేవిధంగా ఆగస్టు 15 లోపు రెండు లక్షల రుణమాఫీని చేయడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీని మరోసారి ఆదరించి చేతి గుర్తుపై ఓటు వేయాలని కోరారు. గ్రామ నాయకులు వంకుడొాతు రవి, సురేష్, రవీందర్ ఉన్నారు.

# బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించండి

## కూరపాటి వెంకటనారాయణ



**వరంగల్ వాయిస్, నడికూడ :** గత పది సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రం మీద అధికారం చలాయించిన భారతీయ జనతా పార్టీ, అదేవిధంగా బీఆర్ఎస్ 90 శాతం జనాభా ఉన్న బడుగు బలహీన వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా అణిచివేయడం జరిగిందని తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ ప్రముఖ ఆర్థిక సామాజికవేత్త ఆవేదన వ్యక్తం చేశారు. నడికూడ మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం, సామాజిక న్యాయం సాధించుకుందాం.. కేంద్రంలో మార్పు కోసం బీజేపి, బీఆర్ఎస్ లను ఓడిద్దామనే కరపత్రం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ తొమ్మిదిన్నర సంవత్సరాల పాటు తెలంగాణను ఏలుకొని, దోచుకుని రాష్ట్రాన్ని ఏడు లక్షల కోట్ల రూపాయలు అప్పుల పాలు చేసిన కల్వకుంట్ల చంద్రశేఖర రావును ఇటీవల శాసనసభ ఎన్నికల్లో ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టి ఓడించారు. కుటుంబ ఆధిపత్య, నియంతృత్వ దోపిడి పాలన కొనసాగించారని, అలాంటి ప్రజా వ్యతిరేక పాలకులను ఓడించాలని పరకాల నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఫోన్ టాపింగ్, కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి, వేలాది ఎకరాల ప్రభుత్వ భూముల కబ్జాలు చేసి ప్రభుత్వ ధనాన్ని దోచుకుని అనేక దందాలకు పాల్పడ్డ కుటుంబం నాయకత్వం వహిస్తున్న ఆ పార్టీని మరోసారి ఓడించాలని విజ్ఞప్తి చేశారు. గత పది సంవత్సరాల నుండి కేంద్రంలో మోడీ ప్రభుత్వం అమలుపరచిన ఆర్థిక, సామాజిక విధానాలు తిరోగమన దిశలో ఉన్నాయని ప్రొఫెసర్ కూరపాటి ఎద్దేవా చేశారు. ప్రజలకు జీఎస్టీ పేరుతో డీజిల్, పెట్రోల్, గ్యాస్ మొదలగు నిత్యావసర వస్తువులపై విపరీతమైన పన్నులు పెంచి పేదల నుంచి ప్రతి నెల 2 లక్షల పదివేల కోట్ల రూపాయలు వసూలు చేసి కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టుతుందని, దేశంలో 8 లక్షల పేద రైతులు ఆత్మహత్యలు చేసుకున్నప్పటికీ వ్యవసాయాన్ని సంక్షోభం నుంచి కాపాడలేకపోయారని, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం రైతులకు గిట్టుబాటు ధరలను ఇవ్వలేకపోయారని ప్రొఫెసర్ వెంకట్ నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పూలే ఆశయ సాధన సమితి (పాస్) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ 2021 లో జరగవలసిన జనాభా లెక్కలు ఇప్పటి వరకు కూడా ప్రారంభించలేదు. జనాభా లెక్కల ద్వారా వివిధ సామాజిక వర్గాల వివిధ ప్రాంతాల వారిగా అభివృద్ధి తీరుతెన్నులు తెలుస్తాయని, అందుకు తగిన విధంగా ప్రణాళిక వేయలేదని విమర్శించారు. ఈ సమావేశంలో పాస్, నాయకులు డాక్టర్ చందా మల్లయ్య , డాక్టర్ నల్లాని శ్రీనివాస్, డాక్టర్ సుధాకర్, ఓబీసీ నాయకులు బొమ్మ చంద్రమౌళి, నారగాని కుమారస్వామి, వాంకే రాజయ్య, ఈర్ల చిన్ని, తాళ్ల నవీన్, లింగంపల్లి భిక్షపతి, నారగాని ఐలయ్య, రావుల సురేష్, అట్టెం బాబు, పుట్ట శ్యామ్ రాజ్ , తదితరులు పాల్గొన్నారు.

## మోడీ సభకు తరలివెళ్లిన బీజేపీ శ్రేణులు




**వరంగల్ వాయిస్, తొర్రూరు :** బీజేపీ వరంగల్ లోక్ సభ అభ్యర్థి అరూరి రమేష్ గెలుపు కాంక్షిస్తూ బుధవారం వరంగల్ లో ఏర్పాటు చేసిన మోడీ బహిరంగ సభకు తొర్రూరు నుంచి బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈ సందర్భంగా బీజేపీ తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్ మాట్లాడుతూ విశ్వ నాయకుడిగా ప్రఖ్యాతి గాంచిన నరేంద్ర మోడీ వరంగల్ సభలో పాల్గొనడం వల్ల వరంగల్ పార్లమెంట్ ప్రజలకు శుభసూచకమని తెలిపారు. మోడీ బహిరంగ సభ తర్వాత ప్రజల్లో బీజేపీ పట్ల ఆసక్తి పెరిగిందని, ప్రజలంతా సానుకూల దృక్పథంతో ముందుకు వస్తున్నారని తెలిపారు. స్థానికుడైన అరూరి రమేష్ ను గెలిపిస్తే మోడీ సహకారంతో వరంగల్ లోక్ సభ సమగ్రాభివృద్ధికి నాంది పడుతుందని ప్రజలంతా విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ తొర్రూరు అర్బన్ ప్రధాన కార్యదర్శి పైండ్ల రాజేష్, ఉపాధ్యక్షులు గట్ల భరత్, విజయ్ కుమార్, ఎస్సీ మోర్చా తొర్రూరు అర్బన్ అధ్యక్షుడు మంగళపల్లి యాకయ్య, బీజేవైఎం తొర్రూరు అర్బన్ అధ్యక్షుడు కాగు నవీన్, ఎస్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాయపురం రాజకుమార్, శక్తి కేంద్రం ఇంచార్జులు జలగం రవి, వినయ్ శర్మ, చలువాది సత్యనారాయణ, బూత్ కమిటీ అధ్యక్షులు గంధం రాజు, పప్పుశెట్టి సంతోష్, శ్రీనాథ్, చలపతి రాజ్, శివసాయి, సురేష్, తేజస్, నాగేష్, హరీష్ ,సాయి ముకేష్, మెండిస్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కుట్రలను అడ్డుకోవాలి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** వరంగల్ లోక్ సభ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మారేపల్లి సుధీర్ కుమార్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అమ్మాపురం బీఆర్ఎస్ అధ్యక్షుడు ముద్దం వీరారెడ్డి, ఎంపీటీసీ డోనుక ఉప్పలయ్య, మాజీ సర్పంచ్ కడెం యాకయ్యలు కోరారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని అమ్మాపురం గ్రామంలో రెండో రోజు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయని, మోసపూరిత హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. కల్యాణలక్ష్మి, రైతు బీమా, రైతుబంధు, మిషన్ భగీరథ, తాగునీరు, కాళేశ్వరంతో సాగునీరు లాంటి మరెన్నో పథకాలను అందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో రైతులకు సాగునీటి ఇబ్బందులు లేవని, కాంగ్రెస్ పాలనలో పంటపొలాలకు నీరు అందక ఎండిపోయాయని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తమ్మెర వీరభద్రరావు, గూడెల్లి ఎల్లయ్య, యూత్ అధ్యక్షుడు గుంటుక వెంకటేష్, మాజీ వార్డు సభ్యుడు గద్దల శ్రీకాంత్, నాయకులు డోనుక రాంబాబు, సైదులు, యాకసోములు, మార్క శ్రీనివాస్, బొమ్మెర బాష, ఏనుగంటి శ్రీకాంత్, మద్దెల సంతోష్, యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతమైన ఎన్నికలకు పోలీస్ శాఖ సిద్ధం

## ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ జిల్లా పోలీస్ అధికారులతో మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్ లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా పోలీస్ యంత్రాంగం నిర్వహించవలసిన విధులు, బాధ్యతలు గురించి సమీక్షించారు. ఎన్నికలకు ముందు 72 గంటల నుంచి చేయవలసిన కసరత్తుల గురించి అధికారులకు వివరించారు. ఎన్నికల ప్రక్రియ మొదలైన సమయం నుంచి బ్యాలెట్ బాక్సులు సంరక్షణ, కౌంటింగ్, ఫలితాల వెల్లడి వరకు పోలీస్ అధికారులు సిబ్బంది అప్రమత్తం గా ఉండాలని ఎస్పీ సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలింగ్ నిర్వహణకు ఆటంకాలు లేకుండా పోలీసు సిబ్బందిని నియమించాలన్నారు. ఓటింగ్ కు అవసరమయ్యే సామాగ్రి పోలింగ్ కేంద్రాలకు చేర్చేలా బందోబస్తు చేపట్టాలన్నారు. పోలింగ్ తో పాటు ఈవీఎంల భద్రత, ఓట్ల లెక్కింపు రోజున కట్టుదిట్టమైన భద్రత కల్పించేలా పోలీస్ శాఖ కార్యాచరణ గురించి వివరించారు. జరగనున్న పోలింగ్ నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలను పోలీస్ శాఖ గుర్తించింది గతంలో ఎన్నికల సందర్భంగా జరిగిన గొడవల దృష్ట్యా వీటిని ఎంపిక చేశారు. ఆయా కేంద్రాల పై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. రౌడీలు, పాత నేరస్తులు, గొడవలకు పాల్పడే వారిని గుర్తించి కౌన్సిలింగ్ ఇచ్చి తహీశీల్దారుల ఎదుట వారిని బైండోవర్ చేయాలాన్నారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా స్థానిక పోలీసుల సహకారంతో కేంద్ర బలగాలు విధులు నిర్వహిస్తారు. ఇప్పటికే చేరుకున్న కేంద్ర బలగాలకు తోడు సర్కిల్ కేంద్రాల పరిధిలోకి అదనపు బలగాలతో ఎన్నికలు నీవహించాలని అన్నారు.. ఎన్నికల నేపథ్యంలో పోలీస్ శాఖ పూర్తిగా అప్రమత్తంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, ట్రైనీ ఐపీఎస్ పండరి చేతన్, మహబూబాబాద్ డీఎస్పీ ఎన్.తిరుపతి రావు, ఏఆర్ డీఎస్పీ విజయ్ ప్రతాప్, సీఐలు, ఎస్ఐలు, అధికారులు పాల్గొన్నారు.

## కొప్పుల ఈశ్వర్ గెలుపే లక్ష్యం



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలో బీఆర్ఎస్ పార్టీ ప్రచారం జోరుగా సాగుతోంది. పెద్దపెల్లి జిల్లా పరిషత్ చైర్మన్ మంథని నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పుట్ట మధూకర్ ఆదేశాల మేరకు లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా వెళ్లి ప్రజలను కారు గుర్తుకు ఓటేసి కొప్పుల ఈశ్వర్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను బీఆర్ఎస్ పార్టీ మహిళా మండల అధ్యక్షురాలు ఓడేటి స్వప్న కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ శాఖ అధ్యక్షురాలు చిలుక సునీత, ఉపాధ్యక్షురాలు భానుమతి, బుజ్జమ్మ, నాయకులు లింగాల రామయ్య, చందు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## సుధీర్ కుమార్ గెలుపు ఖాయం



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండల కేంద్రంలో లోక్‌సభ ఎలక్షన్స్ ప్రచారంలో భాగంగా బుధవారం నడికూడలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎంపీ అభ్యర్థి సుధీర్ కుమార్ గారి గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నడికూడ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దూరిశెట్టి చందూ(చంద్రమౌళి), గ్రామ అధ్యక్షుడు నారగాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రావుల కిషన్, మాజీ సర్పంచ్ ఊర రవీందర్ రావు, మాజీ ఉప సర్పంచ్ కిన్నెర మణి, ముఖ్య నాయకులు సంగానీ వేణు, కొక్కిరాల శ్రీధర్ రావు, మొర్రి సారయ్య, గొడిశాల రంజిత్, నేవారుగొమ్ముల రవీందర్ రావు, దుప్పటి మొగిలి, యూత్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలి

### కార్పొరేటర్ బొంగు అశోక్ యాదవ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డా.మారేపల్లి సుధీర్ కుమార్ ను భారీ మెజారిటీ తో గెలిపించాలని 4వ డివిజన్ కార్పొరేటర్ బొంగు అశోక్ యాదవ్ ప్రజలను కోరారు. వరంగల్ లోక్ సభ ఎన్నికల సందర్భంగా హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఆదేశాల మేరకు బుధవారం 04వ డివిజన్ కార్పొరేటర్ బొంగు అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డా.మారేపల్లి సుధీర్ కుమార్ గెలుపే ధ్యేయంగా కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్తిస్తూ డివిజన్ లోని పలు కాలనీలలో ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కావ్య గెలుపునకు ఇంటింటి ప్రచారం



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** వరంగల్ లోక్ సభ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య గెలుపు కోసం తొర్రూరు పట్టణంలోని 14వ వార్డులో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా తొర్రూరు పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మామిడాల తిరుపతిరెడ్డి, తొర్రూరు మున్సిపాలిటీ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ జినుగా సురేందర్ రెడ్డి, మాజీ సర్పంచులు పెదగాని సోమయ్య, చాపల బాపురెడ్డి, రఘునాథ రెడ్డి, సురేందర్ రెడ్డి, పనికిర రమేష్, పుట్టరాజు ఆదిత్య, రవి, అమల, లేతాకుల సాయిరెడ్డి కుమార్, శ్రీను, లలిత, శ్రీలత, అనిత, మహేశ్వరీ, యశోద, రాణి, సుధాకర్, ఉపేందర్, ఉప్పలమ్మ, కవిత, తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ సినిమా
బుధవారం 08, మే 2024


# రంగంలోకి మహేష్..

## ప్రభాస్ కల్కి మూవీ మరో సంచలనం


పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా వస్తున్న లేటెస్ట్ మూవీ కల్కి 2898 రోజుకో సంచలన వార్తను తెస్తోంది. ఇండియన్ మైథాలజీ అండ్ సైన్స్ ఫిక్షన్ కథాంశంతో వస్తున్న ఈ ప్రెస్టీజియస్ సినిమాను దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కిస్తున్నాడు. దాదాపు రూ.600 కోట్ల భారీ బడ్జెత్‌తో హాలీవుడ్ రేంజ్ లో సినిమాను  తెరకెక్కిస్తున్నారు. అందుకే ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక ఈ సినిమా నుండి ఇప్పటికే విడుదలైన పోస్టర్స్, టీజర్ సినిమాపై అంచనాలు పెంచేయగా.. తాజాగా మరో భారీ అప్డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అదేంటంటే.. కల్కి సినిమా కాస్టింగ్ లిస్టులో మరో సూపర్ స్టార్ చేరాడని అంటున్నారు.. ఆ స్టార్ మరెవరో కాదు టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు. అవును.. కల్కి సినిమాలో మహేష్ బాబు కూడా భాగం కానున్నాడట. సినిమాలో ప్రభాస్ విష్ణు అవతారం ఎంట్రీ సమయంలో వచ్చే సీన్ కి మహేష్ బాబు వాయిస్ ఓవర్ ఇవ్వనున్నాడట. ప్రస్తుతం ఈ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. అయితే.. ఈ విషయంలో ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు కానీ,, నిజమైతే మాత్రం కల్కి సినిమా స్థాయి నెక్స్ట్ లెవల్ కి వెళ్లడం ఖాయం. ఇక కల్కి సినిమా విషయానికి వస్తే.. ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దుల్కర్ సల్మాన్, దీపికా పదుకొనె, దిశా పటాని వంటి స్టార్స్ నటిస్తున్నారు. వైజయంతి మూవీ బ్యానర్ నిర్మిస్తున్న ఈ సినిమా జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. మరి స్టార్ కాస్టింగ్ తో, భారీ అంచనాల మధ్య వస్తున్న కల్కి సినిమా ఇండియన్ సినిమాపై ఎలాంటి ఇంపాక్ట్ క్రియేట్ చేస్తుందో చూడాలి.



## అనుకోకుండా అంతా కలసి సక్సెస్ చేశారు

'ఇడియట్' సినిమా చూసి, 'ఇలాంటి సినిమా మనకు పడుద్దా' అనుకున్నాను. 'ఆర్య' కథ వినగానే 'దిసీజ్ మై ఇడియట్' అనే ఫీలింగ్ కలిగింది. రిలీజయ్యాక నాన్న 'టెన్ వీక్స్ సినిమా' అంటే నేనూ, సుకుమార్ ఉడికిపోయాం. 'ఆర్య' సినిమాకు 125 డేస్ షీల్డ్ తీసుకోకపోతే నా పేరు మార్చుకుంటాను' అని ఆ క్షణమే నాన్నతో సవాల్ చేశా. దాన్ని నిజం చేస్తూ చిరంజీవి గారి చేతుల మీదుగా షీల్డ్ అందుకొని నా మాట నిలబెట్టుకున్నాను' అని అల్లు అర్జున్ అన్నారు. ఆయన కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో దిల్ రాజు నిర్మించిన 'ఆర్య' చిత్రం విడుదలై 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా '20 ఏళ్ల ఆర్య' పేరుతో మంగళవారం చిత్రబృందం హైదరాబాద్‌లో రీ యూనియన్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో అల్లు అర్జున్ మాట్లాడుతూ 'లైఫ్‌లో నాకు ఫస్ట్ సక్సెస్ అంటే ఆర్యనే. మళ్లీ అలాంటి సక్సెస్ నాకు దక్కలేదు. 'గంగోత్రి' సక్సెస్ అయింది. అయినా నేను చూడడానికి అంత గొప్పగా ఏం లేనని హీరోగా అవకాశాలు రాలేదు. అలా ఒక ఏడాది ఖాళీగా కూర్చున్నాను. 'దిల్' చిత్రం ప్రివ్యూకు వెళితే, అక్కడ నన్ను చూసి సుకుమార్ కథ చెప్పారు. నాకు మైండ్ బ్లోయింగ్ అనిపించింది. కొత్తవాళ్లని నమ్మి దిల్‌రాజు గారు డబ్బులు పెట్టి, రిస్క్ చేశారు. ఆయన లేకపోతే మేము ఎవ్వరం లేము. సుకుమార్‌కు దర్శకుడిగా తొలి చిత్రం కావడంతో ఆయన ఈ సినిమాను తీయగలరా? లేదా అనే సందేహం నాన్నకు వచ్చింది. అప్పుడు వివి వినాయక్ గారు 'ఆ కుర్రాడు (సుకుమార్) తీయగలడు. మీరు ముందుకెళ్లండి' అని భరోసా ఇచ్చారు. చిరంజీవి గారు కూడా కథ విని 'బాగుంది' అని సపోర్ట్ చేశారు. ఆయన చేతుల మీదుగా షీల్డ్ అందుకున్నాను. 'ఆర్య'తో దిల్‌రాజు పెద్ద నిర్మాతగా ఆవిర్భవించారు. ఇండియాలో నంబర్ వన్ డైరెక్టర్ స్థాయిలో సుకుమార్ ఉన్నారు. మమ్మల్ని ఇంతలా ఆదరించిన తెలుగు ప్రేక్షకులకు రుణపడి ఉంటాను' అన్నారు.








## సందీప్ కిషన్..

## మాయవన్ లుక్ విడుదల

హీరో సందీప్ కిషన్ , క్రియేటివ్ డైరెక్టర్ సివి కుమార్ కాంబినేషన్‌లో వచ్చిన సెన్సేషనల్ హిట్ ప్రాజెక్ట్ జెడ్ తర్వాత సెకండ్ పార్ట్ కోసం మరోసారి చేతులు కలిపారు. 'మాయవన్ అనే టైటిల్ తో రూపొందుతున్న ఈ సీక్వెల్ ను ఎకె ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై రాంబ్రహ్మం సుంకర ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందే ఈ చిత్రాన్ని అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ సమర్పిస్తోంది. కిషోర్ గరికిపాటి (జికె) ఎగ్జిక్యూటివ్ నిర్మాత. సందీప్ కిషన్  బర్త్ డే సందర్భంగా మేకర్స్ పవర్ ప్యాక్డ్ ఫస్ట్ లుక్ ని విడుదల చేశారు. సందీప్ కిషన్ ఒక పిడికిలిని బిగించి మరో చేతిలో సూపర్ పవర్ వెపన్ తో ఇంటెన్స్ గా చూస్తున్న ఫస్ట్ లుక్ మైండ్ బ్లోయింగ్ గా వుంది. ఈ ఎక్సయిటింగ్ ఫస్ట్ లుక్ సినిమాపై చాలా క్యూరియాసిటినీ పెంచింది. ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు, సాహో ఫేమ్ నీల్ నితిన్ ముఖేష్‌ను కీలక పాత్రలో నటిస్తున్నారు. సందీప్ కిషన్ సరసన ఆకాంక్ష రంజన్ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. టాప్-క్లాస్ ప్రొడక్షన్, టెక్నికల్ స్టాండర్డ్స్‌తో హై బ్జడెట్‌తో రూపొందనున్న ఈ చిత్రం, సూపర్‌విలన్‌తో ఒక సామాన్యుడి ఘర్షణ కథగా ఉండబోతుంది. ఈ చిత్రానికి కార్తీక్ తిల్లై / కవిన్ రాజ్ డీవోపీలుగా పని చేస్తుండగా, సెన్సేషనల్ కంపోజర్ సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు.

# మురిసిన ఓరుగల్లు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం రాత్రి నిర్వహించిన రోడ్ షోతో ఓరుగల్లు మురిసింది. రాళ్ల వాన, ఈదురు గాలులను సైతం లెక్క చేయకుండా కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి రేవంత్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ముచ్చటగా మూడోసారి రేవంత్ రెడ్డి నగరానికి రావడంతో జనం పులకించిపోయారు. హనుమకొండ చౌరస్తా, వరంగల్ నిరగంలోని పోచమ్మమైదాన్ జంక్షన్ లో నిర్వహించిన కార్నర్ మీటింగులకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. భారీ వర్షం కారణంగా కరీంనగర్ బహిరంగ సభను రద్దు కావడంతో వరంగల్, హనుమకొండ కార్నర్ మీటింగులు కూడా రద్దయినట్లు ప్రచారం సాగింది. అయితే వర్షాన్ని లెక్క చేయకుండా సీఎం రోడ్డు మార్గంలో హనుమకొండకు చేరుకోవడంతో జనం పెద్ద ఎత్తున హర్షద్వానాలు చేశారు. ఓరుగల్లు ప్రధాన రహదారులకు ఇరువైపుల జనం భారీ సంఖ్యలో చేరి రేవంత్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఆయన ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. డాక్టర్ కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అదే మీరు నాకిచ్చే కానుక అంటూ సూచించారు. ఈ సందర్భంగా జై కాంగ్రెస్..జై రేవంతన్న అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అవకాశం ఇవ్వండి..అభివృద్ధి చేస్తానంటూ కడియం కావ్య ప్రకటించడంతో ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు జేజేలు పలికారు.

### విపక్షాల్లో వణుకు..

వరంగల్ లోక్ సభ పరిధిలో ఉత్సాహంగా కాంగ్రెస్ పార్టీ నేతలు ఎన్నికల ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏడు సెగ్మెంట్లలో కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యేలు, పార్టీ జిల్లా అధ్యక్షులు, క్యాడర్ అంతా కలిసి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. మతతత్వ పార్టీలతో జాగ్రత్తగా ఉండాలంటూ సూచిస్తున్నారు. మోడీ, కేసీఆర్ తెలంగాణ ప్రజలను మోసం చేశారని, రాష్ట్రాన్ని విధ్వంసం చేశారంటూ ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కాంగ్రెస్ స్పీడ్ తో విపక్షాల్లో అంతర్మథనం ప్రారంభమైంది. కాంగ్రెస్ ను నిలువరించేందుకు పడరాని పాట్లు పడుతున్నారు.

# రాష్ట్రంలో కాంగ్రెస్ జెండా ఎగిరింది

## ఇప్పుడు ఢిల్లీలో ఎగరాలి
## ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య



**వరంగల్ వాయిస్, శాయంపేట :** రాష్ట్రంలో కాంగ్రెస్ జెండా ఎగిరింది..అదే విధంగా ఢిల్లీలో కూడా కాంగ్రెస్ జెండా ఎగరేయాలని ఆ పార్టీ వరంగల్ లోక్ సభ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య పిలుపునిచ్చారు. బుధవారం శాయంపేట, గీసుగొండ మండల కేంద్రాల ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశాలలో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డితో కలిసి డాక్టర్ కడియం కావ్య పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు ఇచ్చిన తీర్పునే ఇప్పుడు బీజేపీకి ఇవ్వాల్సిన టైం వచ్చిందన్నారు. దేశానికి రాహుల్ గాంధీ ప్రధాని కావాల్సిన అవసరం వచ్చిందన్నారు. మీ ఇంటి ఆడబిడ్డగా భావించి నిండు మనసుతో ఆశీర్వదించాలన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

### ఉప్పుగల్ నుంచి భారీగా చేరికలు..

జఫర్‌గఢ్ మండలం ఉప్పుగల్ గ్రామంలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు సుమారు 200 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పార్టీ కండువ కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికల్లో కడియం కావ్య విజయానికి మా వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు, కులసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# ఎన్నికలను బహిష్కరిస్తున్నాం..

## సిగ్నల్ తండాలో ఫ్లెక్సీల ఏర్పాటు

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డు ప్రజలంతా ఒక్కటిగా నిలిచారు. మా ఊరికి రోడ్డు వచ్చే వరకు ఎన్నికలను బహిష్కరిస్తామంటూ ప్రకటించారు. ఈ మేరకు ఊరి పొలిమేరలో భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తండా నాయకుడు భూక్య శేఖర్ నాయక్ మాట్లాడుతూ ఓట్ల కోసం వచ్చే నాయకులే తప్ప.. అభివృద్ధి చేసే నాయకుడు కరువయ్యాడని ఆరోపించారు. కనీస సౌకర్యాలు తమకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో మారుమూల తండాలు సైతం అభివృద్ధి చెందుతున్నా తమ తండాకు కనీసం రోడ్డు సౌకర్యం కూడా లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి ఆర్ఓబీ వరకు చినుకు పడితే చిత్తడిగా మారుతుందని పేర్కొన్నారు. దశాబ్దాలుగా పాలించిన పాలకులు తండాకు రోడ్డు కూడా వెయించలేదని దుయ్యబట్టారు. వార్డు సభ్యుడి నుంచి పార్లమెంటు సభ్యుడి వరకు గిరిజనులే అయినా రోడ్డు సౌకర్యం కల్పించే నాథుడే కరువయ్యాడని వాపోయారు. 2500 జనాభా ఉన్నప్పటికీ సరైన రోడ్డు మార్గం లేక వానాకాలం నరకయాతన పడుతున్నామన్నారు. ఇటీవల రూ.52 లక్షలతో పనులు ప్రారంభించినప్పటికీ పనులు పధ్యంతరంగా నిలిచిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎనిమిది దశాబ్దాలుగా ఈ ప్రాంతాన్ని ఏలుతున్న పాలకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఇంటికో పడవ ఇవ్వాలని కోరారు. ప్రజల కనీస సౌకర్యాలు కల్పించేంత వరకు నాయకులేవరు ఓట్లు అడగరాదంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి నిరసన తెలిపారు.

# ద్రోహులను ఓడించాలి

## ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాజకీయాల్లో ఎన్నో అవకాశాలను కల్పించినప్పటికీ పార్టీకి ద్రోహం చేసిన అరూరి రమేష్, కడియం కావ్యలను చిత్తుగా ఓడించాలని శాసనమండలి సభ్యుడు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ వరంగల్ లోకసభ అభ్యర్థి డాక్టర్ మారేపల్లి సుధీర్ కుమార్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ఉద్యమ స్ఫూర్తితో పని చేయాలని ఆయన కోరారు. నయవంచకుడు కడియం శ్రీహరి డబ్బు మూటలతో పార్టీ మారాడని విమర్శించారు. బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ కబ్జాకూరు అంటూ ధ్వజమెత్తారు. ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రైతులు, ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు వారు అడగకున్నా అందాయన్నారు. అందుకే కేసీఆర్ పాలనలో వారు సంతోషంగా ఉన్నారన్నారు. కానీ మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ప్రజలు అష్ట కష్టాలు పడుతున్నారని ధ్వజమెత్తారు. కరెంటు, నీటి కష్టాలు మొదలయ్యాయని ఆరోపించారు. ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాకతీయుల గడ్డకు చేసింది ఏమీ లేదని దుయ్యబట్టారు. వరంగల్ సమగ్రాభివృద్ధికి, వేయి స్తంభాల గుడి, రామప్ప దేవాలయ అభివృద్ధికి పాటుపడింది గత బీఆర్ ఎస్ ప్రభుత్వమేనన్నారు. భద్రకాళి దేవాలయం అభివృద్ధికి గత ప్రభుత్వ మంజూరు చేసిన రూ.30 కోట్ల నిధులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని ఆరోపించారు. రామప్ప ఆలయాన్ని యునెస్కో గుర్తిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఇవ్వలేదని, దక్షిణ కుంభమేళాగా పేరుగడించిన మేడారం జాతరను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. వరంగల్ లో బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సుధీర్ కుమార్ గెలిస్తే ఢిల్లీలో తెలంగాణ వాదం బలంగా వినిపిస్తుందన్నారు. ద్రోహులు కడియం శ్రీహరి, ఆరూరి రమేష్ కు ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణను కాపాడేది గులాబీ పార్టీ ఒక్కటే అన్నారు. బీఆర్ ఎస్ అభ్యర్థిని లోక్ సభకు పంపితే తెలంగాణ గొంతు పార్లమెంటులో వినిపిస్తారన్నారు. ఆయనను భారీ మెజారిటీతో గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేయవద్దని పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో లోకసభ అభ్యర్థి డాక్టర్ మారేపల్లి సుధీర్ కుమార్ తోపాటు ఎమ్మెల్సీ బండా ప్రకాశ్, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, నన్నపునేని నరేందర్, తాటికొండ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఓటు విలువైనది

## దాన్ని అందరూ వినియోగించుకోవాలి
## మహర్షి గోశాల వ్యవస్థాపకులు సర్జన రమేష్ గురూజీ

**వరంగల్ వాయిస్, భీమారం :** ప్రజాస్వామ్యం దేశంలో ఓటు హక్కుకు ఎంతో విలువైనది..దానిని ప్రతి పౌరుడు తప్పకుండా వినియోగించుకొని ఓటు విలువను గౌరవించాలని మహర్షి గోశాల వ్యవస్థాపకులు సర్జన రమేష్ గురూజీ అన్నారు. బుధవారం ప్రముఖ సామాజికవేత్త, ఓటర్ చైతన్య పోరాట యోధుడు నిమ్మల శ్రీనివాస్ తన 30 రోజుల ఓటర్ అవేర్ నెస్ కార్యక్రమంలో భాగంగా రికార్డ్ సర్వీస్ సొసైటీ సెంట్రల్ కోఆర్డినేటర్ కుసుమ కవిత, ఏపీజే అబ్దుల్ కలాం ఫౌండేషన్ అధ్యక్షులు దేవునూరి ఆనంద్ లతో కలిసి గోశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. పల్లె ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లో విద్యావంతులు ఓటు వేసేందుకు నిరాశక్తత చూపడంతో ఓటింగ్ శాతం చాలా తక్కువగా నమోదవుతుందన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా తమ తోటి వారికి అవగాహన కల్పించి ఓటింగ్ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన హితవు పలికారు. కవిత మాట్లాడుతూ మహిళలందరూ ఉత్సాహంగా ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఓటు వేయాలని కోరారు. ఆనంద్ మాట్లాడుతూ ఓటు హకు ప్రతి పౌరుని బాధ్యత అని గుర్తించాలని, యువత నడుం బిగించి ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గోశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఓటరు ప్రతిజ్ఞ చేసి , ఓటరు చైతన్య నినాదాలతో కూడిన ప్ల కార్డ్స్ ప్రదర్శించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE. EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com